అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న స్పెషల్‌ ఆఫీసర్‌ శశాంక, కలెక్టర్‌ గౌతమ్‌ తదితరులు

జిల్లా స్పెషల్‌ ఆఫీసర్‌, స్టేట్‌ ఫ్లాగ్‌ షిప్‌ ప్రాజెక్టు కమిషనర్‌ శశాంక

- రైతు ఆత్మీయ భరోసా, రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను అర్హులకు అందించే దిశగా జిల్లా అధికార యంత్రాంగం పని చేయాలని జిల్లా స్పెషల్‌ ఆఫీసర్‌, స్టేట్‌ ఫ్లాగ్‌ షిప్‌ ప్రాజెక్టు కమిషనర్‌ కె.శశాంక అన్నారు. శుక్రవారం నగర శివారు శామీర్‌పేట తహసీల్దార్‌ కార్యాలయంలో సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌తో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబర్‌ ప్రకారం వ్యవసాయానికి యోగ్యమైనదా?, కాదా? అనే స్పష్టతను గుర్తించాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను నిర్వహించాలన్నారు. భూ భారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా చెల్లిస్తుందని తెలిపారు. సాగుకు యోగ్యం కాని భూముల జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రూ. 6 వేల చొప్పున రెండు విడుతలుగా రూ. 12 వేల నగదు సాయం అందించనుందన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్‌ కార్డుతో లింక్‌ చేయాలన్నారు. ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఎంపీడీ ఓ ఉంటారని, వీరు ఎంపీఓల సమన్వయంతో పని చేయాలన్నారు. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు గ్రామ సభల్లో వస్తే వాటిని స్వీకరించి, పరిశీలించాలన్నారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా రేషన్‌ కార్డులు లేని పేద కుటుంబాల జాబితాను పరిశీలించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీలో కమిషనర్‌ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారన్నారు. జాబితాను చర్చించిన తర్వాతే ఆమోదించాలని ఆయన స్పష్టం చేశారు. వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

- సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం జిల్లా స్పెషల్‌ ఆఫీసర్‌, స్టేట్‌ ఫ్లాగ్‌ షిప్‌ ప్రాజెక్టు కమిషనర్‌ కె.శశాంక శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌, తూముకుంటల్లో పర్యటించారు. అలియాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారురాలు పద్మ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూముకుంటలో రేషన్‌ కార్డుల సర్వేను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, శామీర్‌పేట్‌ తహసీల్దార్‌ యాదగిరి, డీఆర్‌డీఏ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుగుణబాయి, హౌజింగ్‌ పీడీ రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట గోపాల్‌, ఎంపీడీఓ సుగుణ బాయి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న స్పెషల్‌ ఆఫీసర్‌

పేదలకు పథకాలు అందించడమే లక్ష్యం

పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్‌ గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌, అధికారులు

ఆల్విన్‌కాలనీ: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌ కార్డుల పంపిణీ వంటి పథకాల అమలుకై ఆల్విన్‌ కాలనీ డివిజన్‌ పరిధిలోని జన్మభూమి కాలనీలో జరుగుతున్న సర్వేను కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌, అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే కోసం వచ్చిన అధికారుల బృందానికి ప్రజలు వాస్తవ వివరాలను అందజేయాలన్నారు. తొలిదశలో సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించటం కోసం పరిశీలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్‌, శ్రావణి, రవికుమార్‌, ముస్తఫా, నాయకులు పాండుగౌడ్‌, జిల్లా గణేష్‌, కాశీనాథ్‌ యాదవ్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొని బిల్లులు చెల్లించలేని నిజమైన పేదలు సీఎంఆర్‌ఎఫ్‌తో లబ్ధి పొందాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. శుక్రవారం రిజ్వానా సుల్తానాకు మంజూరైన రూ. 2 లక్షల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం కొనసాగుతుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

క్లుప్తంగా

జేఎన్‌టీయూహెచ్‌లో ఫ్యాకల్టీ నియామక ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలో పాల్గొన్న అభ్యర్థులతో ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో అఫిలియేటెడ్‌ ప్రైవేట్‌ కాలేజీల అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల భర్తీకి నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ నియామక ఇంటర్వ్యూలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూ నూతన అడ్మిషన్‌ బ్లాక్‌లో ఈ నెల 20 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ వి. బాలకిష్టారెడ్డి, రెక్టార్‌ ప్రొఫెసర్‌ కె. విజయకుమార్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ డా. కె. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్‌

మూసాపేట: డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మాజీ కార్పొరేటర్‌ బాబూరావు అన్నారు. బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఆంజనేయ నగర్‌ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌, సుశీల్‌కుమార్‌ పాల్గొన్నారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్‌ హరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఫోన్‌లో ప్రయాణికులు తమ సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. సలహాలు కూడా స్వీకరిస్తామన్నారు. 9959226151 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జిమ్‌ పరికరాల ఏర్పాటు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌ తదితరులు

బాలానగర్‌: ఫతేనగర్‌ డివిజన్‌ పరిధిలోని పార్థీ బస్తీలో కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న జిమ్‌ పనులను కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌ శుక్రవారం ఏఈ రాధాకృష్ణ, కాంట్రాక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో రూ.18 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షుడు కంచి బిక్షపతి, జయమ్మ, శోభన్‌బాబు, బబ్లు, రాజేశ్వర్‌, యువకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న బండి రమేష్‌ తదితరులు

బాలానగర్‌: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదవారి ఆరోగ్యాలను కాపాడేందుకు ఎంతగానో తోడ్పడుతుందని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. శుక్రవారం బాలానగర్‌లోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఫతేనగర్‌కు చెందిన జలందర్‌కు రూ.60 వేల చెక్కు, అల్లాపూర్‌కు చెందిన చెరుకూరి తేజేశ్వరరావుకు రూ. 60 వేల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, డివిజన్‌ అధ్యక్షులు మోయిజుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మేయర్‌ సమీక్ష



సమావేశంలో పాల్గొన్న మేయర్‌ తదితరులు

నిజాంపేట్‌ : మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో శుక్రవారం మేయర్‌ నీలా గోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. బాచుపల్లి, నిజాంపేట్‌ ఆయా డివిజన్ల పరిధిలో వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, వసతులు, అవసరమైన నిధులు, పెండింగ్‌ పనులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో కమిషనర్‌ సాబేర్‌ అలీ, ఎస్‌ఈ సత్యనారాయణ, కార్పొరేటర్లు ఆగం పాండు, విజయలక్ష్మి, సుజాత, వీరేందర్‌రెడ్డి, సుధాకర్‌, బాలాజీ, శిరీష, సురేష్‌రెడ్డి, వెంకటేష్‌, రవికిరణ్‌, పావని, రాజేశ్వరి, జ్యోతి, శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్‌ సభ్యులు సయ్యద్‌ సలీం, జ్యోతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీఎం వాలీబాల్‌ టోర్నమెంట్‌ పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న పట్నం మహేందర్‌ రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కల్చర్‌, వెల్ఫేర్‌ అండ్‌ స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సీఎం వాలీబాల్‌ టోర్నమెంట్‌ కప్‌ వాల్‌ పోస్టర్‌ని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌ విప్‌, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు సతీష్‌ రెడ్డి, సీనియర్‌ నాయకులు సంజీవ రావు, మైఖేల్‌, కొండల్‌ రెడ్డి, ప్రవీణ్‌ కుమార్‌, అరవింద్‌ రెడ్డి, రేష్మ, నజీర్‌, బాబూ, రాజు, శ్రీధర్‌, గిరి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌..

పేకాడుతున్న 15 మంది అరెస్ట్‌

మూసాపేట: పేకాట స్థావరంపై దాడి చేసి 15 మందిని గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి పోలీసుల వివరాల ప్రకారం.. మూసాపేటలోని హనుమాన్‌ చౌక్‌ వద్ద కొంచాడ సీతారాం నివాసం ఉంది. ఆ ఇంటిలో ఇంటి యజమానితో పాటు మరో 14 మంది పేకాడుతున్నారన్న సమాచారంతో బాలానగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ.1.71 లక్షలు, 15 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



ఓలెపు సాయన్న (ఫైల్‌)

మూసాపేట: సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిర్మల్‌ జిల్లా నర్సాపూర్‌ గ్రామానికి చెందిన ఓలెపు సాయన్న (19)మూసాపేటలోని మెరీనా స్కైస్‌ అపార్టుమెంట్‌లో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీన వచ్చి రెండు రోజులు విధులు నిర్వహించాడు. 7వ తేదీన తన సొంత ఊరుకు వెళ్లి వస్తానని చెప్పి మద్యం తాగి బయటకు వెళ్లాడు. ఆ తరువాత అతను తన స్వగ్రామానికి వెళ్లలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీసినా సమాచారం లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో రెండవ విడుత క్యాంపస్‌ క్లీన్‌ కార్యక్రమానికి శుక్రవారం నిర్వహించారు. బాలుర వసతి గృహాల పరిసరాలలో నిర్వహించిన క్లీన్‌ క్యాంపస్‌ కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ డాక్టర్‌ వి. బాలకిష్టారెడ్డి, రెక్టార్‌ డా. కె. విజయకుమార్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ డా. కె. వెంకటేశ్వరరావు, యూనివర్సిటీ వివిధ విభాగాల డైరెక్టర్లు, ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్‌ వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించడంలో పరిసరాల పరిశుభ్రత కూడా దోహదపడుతుందన్నారు.

చిత్తారమ్మ జాతర షురూ

- వివిధ పూజలు.. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- సోమవారం వరకు ట్రాఫిక్‌ ఆంక్షలు



చిత్తారమ్మ దేవి

సుభాష్‌నగర్‌: గాజులరామారంలో చిత్తారమ్మ దేవి జాతర (స్వర్ణోత్సవాలు) శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటిరోజు గణపతి పూజ, పుణ్యా వచనం, బోనాలు, అగ్ని ప్రతిష్టాపన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కూన అంతయ్య గౌడ్‌, కార్పొరేటర్‌ రావుల శేషగిరి, ఆలయ కమిటీ సభ్యులు, బాలరాజు, నరసింహ, ఇంద్రసేన గుప్తా, సత్తయ్య, శంకర్‌ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, పెంటారెడ్డి, బుచ్చిరెడ్డి, గొరిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

పోలీస్‌ అధికారుల పరిశీలన

జాతర నేపథ్యంలో లా అండ్‌ ఆర్డర్‌ బాలానగర్‌ డీసీపీ సురేష్‌, మేడ్చల్‌ జోన్‌ ట్రాఫిక్‌ డీసీపీ గుణ శేఖర్‌ ఆలయాన్ని సందర్శించారు. జాతరలో ఎలాంటి ఘటనలు జరగకుండా, ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా అధికారులకు పలు సూచనలు చేశారు.



ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా సూచనలు చేస్తున్న మేడ్చల్‌ డివిజన్‌ ట్రాఫిక్‌ డీసీపీ గుణ శేఖర్‌



బోనం సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ట్రాఫిక్‌ మళ్లింపు

జాతర నేపథ్యంలో శనివారం అర్ధ రాత్రి నుంచి సోమవారం వరకు షాపూర్‌నగర్‌ గాజులరామారం ప్రధాన రోడ్ల మార్గంలో ఆంక్షలు విధించారు. షాపూర్‌ నగర్‌ నుంచి గాజులరామారం వెళ్లే భారీ వాహనాలు బాలానగర్‌ డీసీపీ కార్యాలయం నుంచి జగద్గిరిగుట్ట మీదుగా, చిన్న వాహనాలను ఉషా ముల్లపూడి హాస్పిటల్‌ నుంచి, గాజులరామారం నుంచి షాపూర్‌ నగర్‌కు వచ్చే వాహనాలను దేవేందర్‌ నగర్‌, మెట్టుకాని గూడా మీదుగా మళ్లించనున్నారు. భక్తుల వాహనాల పార్కింగ్‌ సదుపాయం కోసం ఆలయం చుట్టు ఉన్న ఫంక్షన్‌హాల్‌లను కేటాయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌ రెడ్డి, బాలానగర్‌ ఏసీపీ హనుమంతరావు, ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్‌ తదితరులున్నారు.

సెల్లార్‌లో షాపులు..

రోడ్డుపై వాహనాల పార్కింగ్‌

ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు


కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో సెల్లార్‌లో షాపులు ఏర్పాటు చేయడంతో వాహనదారులు రోడ్లపై పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్‌ సమస్య తీవ్రమవుతోంది. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, భాగ్యనగర్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ సెల్లార్‌లు అధికంగా ఉన్నాయి. భవన నిర్మాణంలో సెల్లార్‌ను ఆ భవనంలో ఉన్నవారి వాహనాల పార్కింగ్‌ కోసం ఉపయోగించాలి. కానీ అద్దెలకు అలవాటు పడ్డ భవన యజమానులు సెల్లార్‌లలో షెట్టర్‌లు ఏర్పాటు చేసి వివిధ షాపులకు అద్దెలకు ఇస్తున్నారు. ఆయా షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్‌ చేయాల్సిన పరిస్థితి ఉంది. అంతేకాకుండా ఆ భవనంలో ఉన్నటువంటి నివాసితుల కార్లు, ద్విచక్ర వాహనాలు సైతం రోడ్లపైనే పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇరుకైన రోడ్లు ఉన్న చోట పరిస్థితి దారుణంగా ఉంది. పలుమార్లు సంబంధిత శాఖల అధికారులు భవన యజమానులకు నోటీసులు ఇచ్చినా పరిస్థితి మారటం లేదు. అధికారులు కూడా నోటీసులు ఇచ్చిన అనంతరం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ షాపులో షార్ట్‌ సర్క్యూట్‌ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. చుట్టు పక్కల మూడు షాపులకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు శతవిధాల కష్టపడాల్సి వచ్చింది. మున్సిపల్‌ అధికారులు, ట్రాఫిక్‌ అధికారులు సెల్లార్‌లో షెట్టర్‌లు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని అక్రమ పార్కింగ్‌ను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కేపీహెచ్‌బీ కాలనీలో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది

భవన యజమానులు అద్దెలకు ఆశపడి సెల్లార్‌లలో పార్కింగ్‌ సౌకర్యం కల్పించడం లేదు. షాపులు ఏర్పాటు చేసుకొని వేలకు వేలు అద్దెలు వసూలు చేస్తున్నారు. దీంతో పగలు, రాత్రి అని తేడా లేకుండా రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో పనుల మీద బయటకు వచ్చే క్రమంలో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సెల్లార్‌లలో ఉన్న షాపులను కూల్చి వేసి, వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.



–విక్కీ, స్థానికుడు